క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- గెలుపోటములను సమానంగా తీసుకోవాలి
- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి
- వీణవంక ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి

వీణవంకలో స్పోర్ట్స్‌మీట్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, ఎంఈవో, ఎస్ఐ

వీణవంక, డిసెంబర్ 9: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ట్రినిటీ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ మీట్-2023ను వీణవంక ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆల్ ద బెస్ట్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కష్టపడి చదువుకొని తల్లిదండ్రుల పేరు నిలబెట్టడమే కాకుండా క్రీడల్లో రాణించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఆధునిక కాలంలో టెక్నాలజీ పెరిగిపోయి విద్యార్థులు, యువత పెడదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీవీ, సెల్‌ఫోన్‌తో సమయం వృథా చేయవద్దని సూచించారు. మద్యం, గంజాయివంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. విద్యార్థులు మంచి ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఇటు పాఠశాలకు, అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, టెన్నిస్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో విడపు శ్రీనివాస్, సర్పంచులు నీల కుమారస్వామి, పొదిల జ్యోతి-రమేశ్, ఎస్ఐ ఆసిఫ్, ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్లు, వీణవంక, చల్లూరు పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌మీట్‌కు హాజరైన క్రీడాకారులు, విద్యార్థులు

లాంఛనంగా 'మహాలక్ష్మి' ప్రారంభం



హుజూరాబాద్ బస్టాండ్‌లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ పీ అర్పిత, ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 9: మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని శనివారం మధ్యాహ్నం హుజూరాబాద్ బస్టాండ్‌లో ఆర్టీసీ డిపో మేనేజర్ పీ అర్పిత, ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి ఉచిత టికెట్‌ను డీఎం సీఐకి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆలేటి సుశీల, పలు మండలాల అధ్యక్షులు కొల్లూరి కిరణ్, రాజేశ్వరరావు, శ్యామ్‌సుందర్‌రెడ్డి, చరణ్ పటేల్, పలు పట్టణాల మహిళా అధ్యక్షురాళ్లు యేముల పుష్పలత, పూదరి రేణుక, రజిత, పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, సీనియర్ నాయకులు సాహెబ్ హుస్సేన్, ఎండీ ఖలీద్‌హుస్సేన్, చంద్రశేఖర్, యూ శ్రీనివాస్‌పటేల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అఫ్సర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చల్లూరి రాహుల్, నాయకులు రమేశ్, బాబు, రవీందర్, కార్యకర్తలు, మహిళలు, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులకు స్వీట్ల పంపిణీ

చిగురుమామిడి, డిసెంబర్ 9: మహాలక్ష్మి, చేయూత పథకాలను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం సంబురాలు జరుపుకొన్నారు. హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్, జిల్లా నాయకులు రవీందర్, ప్రవీణ్ కుమార్, రాములు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు

- చిగురుమామిడి మండలంలో ఇప్పటి దాకా రూ.27.31 కోట్ల చెల్లింపు
- చివరి దశకు ధాన్యం సేకరణ ప్రక్రియ

చిగురుమామిడి, డిసెంబర్ 9: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం డబ్బులు చేతికి వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల హడావుడిలో ఉన్నప్పటికీ అధికారులు ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో మండలంలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగడంతోపాటు వడ్లు విక్రయించిన రైతుల ఖాతాలో పది రోజుల్లో డబ్బులు జమవుతున్నాయి.

ధాన్యం తూకం వేస్తున్న రైతులు

2163 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ

మండలంలోని సీతారాంపూర్, రేకొండ, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, సుందరగిరి, నవాబుపేట్, గాగిరెడ్డిపల్లి, గునుకుల పల్లె, ఓగులాపూర్, రామంచ, ముల్కనూర్ 12 గ్రామాల్లో సింగిల్ విండో ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ ధాన్యం సేకరణ చేపట్టారు. ప్రస్తుతం ధాన్యం సేకరణ ప్రక్రియ దాదాపు చివరి దశకు చేరుకుంది. ఇప్పటి దాకా సింగిల్ విండో ఆధ్వర్యంలో 2,163 మంది రైతుల నుంచి 1.24 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. రూ.27.31 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు.

వారం లోపే ఖాతాల్లో డబ్బులు జమ

మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాం. రైతుల నుంచి ధాన్యం తీసుకున్న వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. రైతుల ఖాతాలో వారం రోజుల్లో డబ్బులు జమవుతున్నాయి. గన్నీ సంచుల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నం.

-నర్సయ్య, సింగిల్ విండో కార్యాలయ సీఈవో, చిగురుమామిడి

దళారుల బెడద తప్పింది

ఏటా సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు దళారుల బెడద తప్పింది. ప్రతి గ్రామంలో కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సులువుగా నేరుగా అమ్ముకునే అవకాశం ఏర్పడింది. డబ్బులు కూడా వారంలోపే ఖాతాలో జమకావడంతో సంతోషంగా ఉంది.

- మెడబోయిన తిరుపతి, రైతు, సుందరగిరి

స్వామియే శరణం అయ్యప్ప

- శరణు ఘోషతో మార్మోగిన కొత్తపల్లి

ఆరట్టు ఉత్సవంలో భక్తులు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 9: స్వామియే శరణం అయ్యప్ప నామ స్మరణతో పట్టణంతో పాటు కొత్తపల్లి గ్రామం శనివారం మార్మోగింది. ఆరట్టు ఉత్సవంలో భాగంగా పట్టణంలో రథోత్సవం నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా పట్టణ శివారులోని శ్రీనాగేంద్రస్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఉత్సవ విగ్రహానికి చక్రస్నానం చేయించారు. పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో మహిళా భక్తుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కొత్తపల్లి అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో భిక్ష(అన్నదానం) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనాగేంద్ర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు పందిళ్ల భాస్కరశర్మ, గురు స్వాములు మోతే తిరుపతి, శ్రీపాద రమేశ్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కొత్త అశోక్‌రెడ్డి, ఈదులకంటి రవీందర్ రెడ్డి, పానుగంటి సత్యనారాయణ, శివనాథుని వేణు, కన్నన్ దొరైరాజ్, వెంకట్రావు, పిల్లి సమ్మయ్య, గుడ్డేల్గుల సమ్మయ్య, వర్దినేని రవీందర్‌రావు, గంగాధర్‌రెడ్డి, చొక్కారపు యాదగిరి, సబ్బని సదానందం, తిరుపతి, సంగెం ఐలయ్య, సతీశ్‌గౌడ్, కుమార్‌స్వామితో పాటు 150 మంది అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 9: హైదరాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకోవాలని హుజూరాబాద్ పట్టణంలోని శ్రీ హనుమాన్ ఆలయంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు అవధానుల భాస్కర్‌శర్మ, సురేందర్ హనుమాన్ విగ్రహానికి ఆకుపూజ, నవరస అభిషేకం, అర్చన, అష్టోత్తరం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ త్వరగా కోలుకొని రాష్ట్ర ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని నాయకులు భగవంతుడి వేడుకున్నారు. కార్యక్రమంలో బండ శ్రీనివాస్‌తో పాటు హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ భూసారపు బాపురావు, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మక్కపల్లి కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, నాయకులు బత్తుల సమ్మయ్య, భాస్కర్‌చారి, కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సామూహిక నిధి చెల్లింపు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 9: పట్టణంలోని మాధవ పురుషుల పొదుపు సంఘ సభ్యుడు ముద్దమల్ల క్రాంతికుమార్ ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య సౌజన్య(నామినీ)కు సామూహిక నిధి నుంచి 31,250 రూపాయలను సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు తొర్రి రవి అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొలిపాక కార్తీక్, సంఘ సభ్యులు పసుల స్వామి, దండగుడుం అశోక్, సమితి గణకులు గాజ రమేశ్, సంఘ గణకులు ప్రతాప మహేశ్, మృతుడి తల్లి పోచమ్మ, అన్న రాజేంద్రప్రసాద్, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

గన్నేరువరం, డిసెంబర్ 9: జిల్లా కేంద్రం నుంచి వయా గుండ్లపల్లి, గన్నేరువరం మండలకేంద్రం నుంచి ఇల్లంతకుంట వరకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు శనివారం బ్రిడ్జి సాధన సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుండ్లపల్లి నుంచి బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ రూట్లో బస్సు నడిపించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరినట్లు చెప్పారు. దీనికి ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంపత్, ఉదయ్ కుమార్, పుల్లెల రాములు, బండారి కల్యాణ్ పాల్గొన్నారు.

వాగేశ్వరి కళాశాలలో అవగాహన సదస్సు

తిమ్మాపూర్, డిసెంబర్ 9: మండలంలోని రామకృష్ణకాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు 'స్మార్ట్ మెటీరియల్స్ అండ్ బయోమెడికల్ అప్లికేషన్స్' అంశంపై శనివారం అవగాహన సదస్సును కళాశాల ఆవరణలో జేఎన్టీయూహెచ్ కెమెస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ తిరుమలాచారి నిర్వహించారు. స్మార్ట్ మెటీరియల్స్, టిష్యూ ఇంజినీరింగ్, బయోమెడికల్ అప్లికేషన్స్‌కి సంబంధించిన పాలిమర్స్, స్మార్ట్ మెటీరియల్ పాలిమర్స్ నిత్యజీవితంలో ఎలా ఉపయోగిస్తున్నారో వివరించారు. అలాగే వివిధ రకాల సర్జరీలకు సంబంధించిన స్మార్ట్ పాలిమర్స్ హాస్పిటల్స్‌లో ఎలా ఉపయోగిస్తున్నారని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, విశ్వనాథ్ వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, హెచ్‌వోడీ సంధ్యారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వీణవంక, డిసెంబర్ 9: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల చందర్ గౌడ్ తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందగా, శనివారం అతడి కుటుంబ సభ్యులను సర్పంచ్ పోతుల నర్సయ్య పరామర్శించారు. వారికి రూ.2 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ వార్డు సభ్యులు చింతల విజయ-రాజు, చింతల రాజయ్య, వికలాంగుల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు పైడిమల్ల శ్రీనివాస్, నాయకులు ఎలుబాక రాజయ్య, బొంగోని ఎల్లయ్య తదితరులున్నారు.